క్లుప్తంగా

13న రంగనాథస్వామి కల్యాణోత్సవం

కొల్లాపూర్: పట్టణంలోని రామమందిరంలో సోమవారం నుంచి జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాస పూజలు కొనసాగుతాయని ఆలయ అర్చకులు రాఘవేంద్రాచార్యులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకు ధనుర్మాస పూజలు ప్రారంభమవుతాయని, జనవరి 13 వతేదీన ఉదయం 11 గంటలకు గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణోత్సవం, 14న కల్యాణమూర్తుల ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కాస్మొటిక్ చార్జీల పెంపుపై హర్షం

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వ హాస్టల్‌లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు కాస్మొటిక్, మెస్ చార్జీలను పెంచడంపై ఆదివారం తీన్మార్ మల్లన్న టీం సభ్యులడు పరశురాములు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచడం సంతోషకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న టీం సభ్యులు శివ, సల్మాన్, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీఓ బ్రహ్మచారి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు సర్వే నిర్వహించారు. ఇంటింట తిరిగి వివరాలు నమోదు చేసుకున్నారు.

ఆర్యవైశ్యులకు రిజర్వేషన్ వర్తింపజేయాలి

మన్ననూర్: ఆర్థికంగా సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన ఆర్యవైశ్యులకు రిజర్వేషన్లు వర్తింపజేయాలని ఆర్యవైశ్య మహాసభ నాయకులు సత్యనారాయణ, వెంకటరమణ, రమేష్ సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి ఆదివారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఆర్య వైశ్యులకు ప్రత్యేక హోదా కల్పిస్తూ వివిధ కార్పొరేషన్‌లలో చైర్మన్‌లుగా అవకాశాలు కల్పించాలని వారు కోరారు.

జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు



అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల ఆవరణలో ఆదివారం జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు షూటింగ్ బాల్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఈనెల 23, 24, 25 తేదీల్లో నల్లగొండ జిల్లాలోని నాగార్జున డిగ్రీ కళాశాలలో టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ పీడీ జగాల్‌రెడ్డి, రమేష్‌బాబు, సైదులు, అంజి, ఉదయ్, విష్ణు, చంద్రకళ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ సేవలు మరువలేనివి



చారకొండ: జూపల్లి మాజీ సర్పంచ్, దివంగత నకినమోని జంగయ్య యాదవ్ చేసిన సేవలు మరువలేనివి అని కల్వకుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముస్తాఫా అన్నారు. మండలంలోని జూపల్లిలో ఆదివారం మాజీ సర్పంచ్ జంగయ్య యాదవ్ మూడో వర్ధంతి సందర్భంగా గ్రామంలో ఆయా పార్టీల నాయకులు, భగత్ సింగ్ యువజన సంఘం సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకటయ్య గౌడ్, గోపాల్, సిరాజ్, జంగయ్య, గ్రామస్తులు, బక్కమ్మ, కార్తీక్, భాగ్యమ్మ, యాదమ్మ, శిరీష ఉన్నారు.

కల్వర్టుకు మరమ్మతు చేయండి

వీపనగండ్ల: మండల కేంద్రం నుంచి సంగినేని పల్లి, తూముకుంట గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న కల్వర్టుపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. వెంటనే కల్వర్టుకు మరమ్మతు చేయాల్సి ఉంది. కల్వర్టుపై గుంతల వల్ల పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురైన సంఘటనలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి అవసరమైన మరమ్మతు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తీరని రేషన్ కష్టాలు

- 27 గ్రామ పంచాయతీల్లో 23 రేషన్ షాపులు
- పట్టించుకోని అధికారులు



ఉప్పునుంతల రేషన్‌షాపులో రేషన్ బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు

ఉప్పునుంతల: ప్రభుత్వాలు మారుతున్నా ప్రజల రేషన్ కష్టాలు మాత్రం తీరడంలేదు. నెలనెలా కిలో మీటర్ల దూరం వెళ్లి రేషన్ బియ్యం తెచ్చుకోవల్సిన పరిస్థితిలో ఏమాత్రం మార్పులేదు. మండలంలోని కొన్ని గ్రామ పంచాయతీల్లో, గ్రామాల్లో రేషన్ దుకాణాలు స్థానికంగాలేక సరుకులు తీసుకోవడానికి వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నెలా కిలోమీటర్లమేర దూరం కాలినడకన, వాహనాలపై వెళ్లి రేషన్ సరకులు తెచ్చుకుంటున్నారు. సరకుల కోసం మరో గ్రామ పంచాయతీకి వెళ్లడం కష్టంగా ఉందని వినియోగదారులు వాపోతున్నారు. ప్రస్తుతం రేషన్ షాపుల్లో బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నారు. రేషన్ బియ్యం విలువకంటే ఆటో చార్జీలే అధికం అవుతున్నాయని రేషన్ వినియోగదారులు వాపోతున్నారు. మండలంలో మొత్తం 27 గ్రామ పంచాయతీలు, 38 ఆవాస గ్రామాలుండగా ప్రస్తుతం 23 రేషన్‌షాపులు మాత్రమే ఉన్నాయి. 9724 రేషన్ కార్డులు ఉన్నాయి. వాటిలో పెద్ద గ్రామ పంచాయతీలుగా ఉన్న ఉప్పునుంతల, తాడూరు, వెల్టూర్, పెనిమిళ్ల, కాంసానిపల్లి లో రెండేసి రేషన్‌షాపుల చొప్పున పది షాపులు ఉన్నాయి. మిగిలిన 22 గ్రామ పంచాయతీల పరిధిలో కేవలం 13 రేషన్ షాపులు మాత్రమే ఉన్నాయి.

పొరుగు గ్రామ పంచాయతీకి వెళ్లి సరుకులు..

కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లో రేషన్‌షాపులు అందుబాటులో లేక పొరుగున ఉన్న గ్రామ పంచాయతీలకు వెళ్లి వినియోగదారులు సరుకులు తెచ్చుకుంటున్నారు. మండలంలోని తిప్పాపూర్ గ్రామ పంచాయతీతోపాటు పంచాయతీ పరిధిలోని తిప్పాపూర్ తండాలకు చెందిన వినియోదారులు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న తాడూరు వెళ్లి రేషన్ సరకులు తెచ్చుకోవాల్సి దుస్థితి నెలకొంది. అదేవిధంగా మొల్గర గ్రామ పంచాయతీకి చెందిన వినియోదారులు పెద్దాపూర్‌కు వెళ్లి సరకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి. ఇక రంగంపేట, కొత్తరాంనగర్ గట్టుకాడిపల్లికి చెందిన గ్రామాల వినియోగదారులు ప్రతినెలా ఉప్పునుంతలకు వచ్చి తమ సరకులను తీసుకుపోవాలి. అదేవిధంగా ఈరట్వానిపల్లి, లత్తీపూర్ రెండు గ్రామ పంచాయతీలకు చెందిన రేషన్ వినియోగదారులు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న గువ్వలోనిపల్లి గ్రామ పంచాయతీకి వెళ్లి సరుకులు తెచ్చుకోవడం ఇబ్బందిగా మారింది. సీబీ తండా, పూర్యానాయక్ తండా గ్రామ పంచాయతీలకు చెందిన రేషన్ వినియోగదారులు నెలనెలా పెనిమిళ్లకు రావల్సివస్తుందని వాపోతున్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న బియ్యం విలువ కంటే రవాణా చార్జీలే అధికమవుతున్నాయని ఆయా గ్రామాల రేషన్ లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విధంగా సరకుల కోసం వెళ్లిన రోజు ఏ ఇతర పని చేసుకోలేని పరిస్థితిలో నష్టపోతున్నామని వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కనీసం గ్రామ పంచాయతీల్లో రేషన్‌షాపులు ఏర్పాటు చేసి స్థానికంగానే సరకులు అందజేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

మూడు కిలోమీటర్ల దూరం



ప్రతి నెలా ఉప్పునుంతల రేషన్ షాపులో ఇచ్చే బియ్యం కోసం మూడు కిలోమీటర్ల దూరం వచ్చి తీసుకెళ్లాలి. నాలుగేళ్ల కిందట కొన్ని నెలలు గ్రామంలోనే రేషన్ బియ్యం ఇచ్చే విధంగా ఏర్పాటు చేశారు. తర్వాత తిరిగి మండల కేంద్రంలో ఇస్తున్నారు. రేషన్ బియ్యం కోసం వెళ్లిన రోజు పూర్తిగా వ్యవసాయ పనులు మానుకోవాల్సి వస్తుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఊరిలోనే రేషన్‌షాపు ఏర్పాటు చేయాలి.

– బొల్లు పార్వతమ్మ, రేషన్ వినియోగదారురాలు, గట్టుకాడిపల్లి

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



దాతలకు సన్మానిస్తున్న నాయకులు

మన్ననూర్: స్థానిక హనుమాన్ ఆలయం అభివృద్ధి కోసం పార్టీ సీనియర్ నాయకులు హన్మంత్‌రెడ్డి, వెంకటరమణ, సైదులు, సత్యనారాయణ, కుమారస్వామితో పాటు మరి కొంత మంది దాతలు ముందుకు వచ్చి ఆదివారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ విరాళాలతో పాటు మరి కొన్ని డబ్బులు జమచేసి ఆలయం పై భాగంలో గోపురం నిర్మాణం చేయాలని తీర్మానించారు. వేణుగోపాల స్వామి ఆలయం ఆవరణలో ఆంజనేయస్వామి మాలధారులు ఇరుముడులు ధరించారు. మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రహీం, బుచ్చయ్య, వెంకటేశ్వర్లు, చంద్రమౌళి, శివాజీ, రాజారాం, సెవ్య బాలు, రమేష్, షకీల్, కృష్ణయ్య, గోపాల్, హనుమాన్ స్వాములు పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



తాడూరులో పడిపూజ నిర్వహిస్తున్న భక్తులు, స్వాములు

తాడూరు: మండల కేంద్రంలో కోనొంపు ప్రాంతంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప మాలధారులు ఇరుముడి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప నామస్మరణ మార్మోగింది. అంతకుముందు ఆలయంలో స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. వివిధ కార్యక్రమాలకు సహకరించిన దాతలను సన్మానించారు. అనంతరం శబరిమలకు వివిధ వాహనాలలో బయలుదేరారు.

అయ్యప్ప పడిపూజ

చారకొండ: మండల కేంద్రంలో అయ్యప్పస్వాముల సన్నిధానంలో నిర్వహించిన పడిపూజకు అయ్యప్ప స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తిగీతాలను ఆలపించారు. అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు, నాయకులు పాల్గొన్నారు.

శబరిమలకు బయలుదేరిన అయ్యప్పస్వాములు

దోమలపెంట: గ్రామానికి చెందిన 19 మంది అయ్యప్ప మాలధారులు ఆదివారం శబరిమలకు ప్రత్యేక బసులో బయలుదేరి వెళ్లారు. ఉదయం అయ్యప్పస్వామి ఆలయంలో గురుస్వామి కస్తూరి బుచ్చిరాములు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి ఇరుముడి కట్టుకున్నారు. జగన్మోహన్‌రావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పి.రాజ, జంగయ్య, సిద్ధార్థ, శ్రీనివాసులు, రవీంద్రబాబు, రవికుమార్ పాల్గొన్నారు.



చారకొండ అయ్యప్ప పడిపూజలో స్వాములు



దోమలపెంటలో..

సాహిత్యంతో రాజకీయ చైతన్యం



మాట్లాడుతున్న యాకూబ్

నాగర్‌కర్నూల్‌రూరల్: సాహిత్యం ద్వారానే రాజకీయ చైతన్యం సాధ్యమని హైదరాబాద్ బుక్‌ఫేర్ అధ్యక్షుడు, కవి సంగమం వ్యవస్థాపకుడు డాక్టర్ కవి యాకూబ్ అన్నారు. ఆదివారం స్థానిక విండో సమావేశ మందిరంలో ఎదిరేపల్లి మశమ్మ స్మారక పురస్కార కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలుగు సాహిత్యాన్ని అంబేడ్కరిజం వైపు గుంటూరు లక్ష్మీనారాయణ అడుగులు వేయించారని కొనియాడారు. కార్యక్రమానికి వనపట్ల సుబ్బయ్య అధ్యక్షతన వహించగా పలువురు కవులు పాల్గొని మాట్లాడారు. ప్రముఖ కవి విమర్శకులు గుంటూరు లక్ష్మీనర్సయ్యకు మశమ్మ స్మారక పురస్కారం ప్రదానం చేశారు. రూ.20 వేల నగదు, మెమెంటో, ప్రశంసాపత్రం, శాలువాలతో సన్మానించారు. విమర్శకుడిగా కవిత్వ నిర్మాణ పద్ధతులు సాహిత్య కళా విమర్శ, దళిత సాహిత్యం, సాత్విక దృక్పథం తదితర పుస్తకాలను గుంటూరు లక్ష్మీనర్సయ్య రచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన వక్తలు కోటేశ్వర్‌రావు, ఎదిరేపల్లి కాశన్న, వెంకటేశ్వర్‌రెడ్డి, ధర్మరాజు, ముచ్చర్ల దినాకర్, కందికొండ మోహన్, వహీద్‌ఖాన్, కవులు పాల్గొన్నారు.

28 నుంచి ఏపీజీవీబీ బ్యాంకు సేవలు నిలిపివేత

చారకొండ: ఈనెల 28 నుంచి ఏపీజీవీబీ బ్యాంకు సేవలకు అంతరాయం ఏర్పడుతుందని జూపల్లి ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్ శివప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నాలుగు రోజులపాటు బ్యాంకు సేవలు, లావాదేవీలు నిలిచిపోతాయని పేర్కొన్నారు. ఏపీజీవీబీ బ్యాంకు తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకుగా మారబోతుందని వివరించారు. ఖాతాదారులు సహకరించాలని కోరారు.

జమ్మి మొక్కకు ప్రత్యేక పూజలు



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని శివుని మాన్యంలో ఆదివారం నూతన జమ్మి మొక్కను నాటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నర్సింహాశర్మ, విజయ భాస్కర్, గ్రామస్తులు మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దండు నర్సింహ, కృష్ణయ్య, ప్రకాష్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రయ్య, లక్ష్మయ్య, వెంకటయ్యగౌడ్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



కల్వకుర్తిరూరల్: సీఎం సహాయనిధి పేదలకు వరంగా మారిందని ఎల్లికట్ట మాజీ సర్పంచ్ రాకేష్‌శర్మ అన్నారు. గ్రామానికి చెందిన జంగిరెడ్డికి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి సహకారంతో రూ.60 వేలు సీఎం రిలీఫ్‌ఫండ్ మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం లబ్ధిదారుడికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లింగం, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంబీ చర్చిలో సెమీక్రిస్మస్ వేడుకలు



కల్వకుర్తి: పట్టణంలోని ఎంబీ చర్చి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఆదివారం నిర్వహించారు. స్త్రీల కూటమి సభ్యులంతా కలిసి వేడుకలు ఏర్పాటు చేశారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆరాధన గీతాలను ఆలపించారు. అనంతరం పాస్టర్ రాజు క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో ఎంబీ చర్చి చైర్మన్ జోహార్ల, సభ్యులు శోభ, పద్మ, ఇందిరా, శ్యామల, సుచరిత, పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమం



వెల్దండ మండలం నారాయణపూర్‌తండాలో..



తాడూరు హోమంలో పాల్గొన్న భక్తులు

వెల్దండ: మండలంలోని నారాయణపూర్‌తండాలో ఆదివారం ఆంజనేయస్వాములు ప్రత్యేక హోమం నిర్వహించారు. నిష్టతో దీక్షలు చేసిన స్వాములు ఇరుముడులతో మద్దిమడుగు పలు వాహనాల్లో బయలుదేరారు. అంతకుముందు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంజినాయక్ స్వామి, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

తాడూరు: మండలంలోని శిర్సవాడ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం పూజారి జగదీశ్వరాచారి ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా విష్ణు సహస్ర నామం, అభిషేకం, అర్చన తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి.

ఘనంగా దత్తాత్రేయ జయంతి

కోడేరు: మండల కేంద్రంలోని సత్యసాయి బాబా సేవా సమితి ఆధ్వర్యంలో దత్తత్రేయ స్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి గణపతి పూజ, అభిషేకం, వ్రతాలు, తదితర పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు రఘువేంద్ర శర్మ, యుగంధర్ రెడ్డి, నర్సయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

లాభసాటిగా ఆయిల్‌పాం సాగు

- ప్రోత్సాహిస్తున్న ప్రభుత్వం
- పెట్టుబడి తక్కువ ఆదాయం ఎక్కువ



మేడిపూర్‌లో సాగు చేసిన ఆయిల్‌పాం తోట



గెలలు తీస్తున్న రైతు

తాడూరు: సంప్రదాయ పంటల సాగుకు రైతులు స్వస్తి పలుకుతున్నారు. పంటల మార్పిడీ చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. మండలంలో ఆయిల్‌పాం సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీనికి తోడు ప్రభుత్వం కూడా ప్రోత్సహించడంతో పంట సాగుపై దృష్టి సారిస్తున్నారు. మూడేండ్లు శ్రమిస్తే 30 ఏండ్లపాటు లాభాలు రావడంతో ఆయిల్‌పాం సాగుకు మొగ్గు చూపుతున్నారు.

సబ్సిడీపై మొక్కలు

ఆయిల్‌పాం మొక్క ఒకటి రూ. 200 ఉండగా రైతులకు 90 శాతం సబ్సిడీతో రూ.20కే ఇస్తున్నారు. ఎకరానికి 57 మొక్కలు అవసరం ఉంటుంది. మొక్కల రాయితీలో ఎలాంటి పరిమితి లేదు. ఆయిల్‌పాం రైతులకు డ్రిప్ రాయితీ 12.5 ఎకరాలు పరిమితం చేశారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీపైన ప్రభుత్వం అందిస్తుంది. యూనిట్ ధరపై 12 శాతం జీఎస్టీని రైతులు చెల్లించాలి. ఓసీ, బీసీ రైతులకు 80, 90 శాతం ఉంటుంది. ఆయిల్‌పాం మొక్కలు నాటుకున్న రైతులకు ఎకరానికి రూ.42 ల చొప్పున నాలుగేండ్లపాటు నేరుగా రైతుల ఖాతాలో జమ చేస్తారు. నాలుగో సంవత్సరం నుంచి పంట దిగుబడి మొదలవుతుంది.

ముమ్మర ప్రచారం

యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లో రైతు వేదికల్లో సదస్సులు నిర్వహిస్తున్నారు. పంటల సాగుపై అవగాహన కల్పించడంతో పాటు పంటల మార్పిడీ విధానంపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. సాంప్రదాయ పంటలు కాకుండా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలనే సాగు చేయాలని రైతులకు సూచిస్తున్నారు. ఆయిల్‌పాం సాగుపై ప్రభుత్వం భారీగా సబ్సిడీ అందించడంతో అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని ఉద్యానవన శాఖ అధికారులు తెలిపారు.

అంతరపంటలకు అవకాశం

ఆయిల్‌పాం మొక్కల మధ్యలో వేరుశనగ, సోయాబీన్, బొప్పాయి, మొక్కజొన్న, పత్తి, కూరగాయలు, ఆకుకూరలు వంటి పంటలను వేసుకొని ఆదాయాన్ని పొందవచ్చు. ఆయిల్‌పాం నాలుగేండ్ల తర్వాత దిగుబడి వస్తుందని అప్పటి వరకు అంతర పంటలు పండిస్తూ ఆదాయం పొందవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రోత్సాహంతోనే ఆయిల్‌పాం సాగు



సంబంధిత అధికారుల ప్రోత్సాహంతోనే ఆరు ఎకరాలలో ఆయిల్‌పాం సాగు చేశాను. మూడేండ్లు పూర్తి అయ్యింది. అధికారులు ఆయిల్‌పాం తోట సాగును పరిశీలించి వారి సూచనలు, సలహాలు పాటించాను. ప్రస్తుతం కోతకు వచ్చింది. వచ్చిన కోతను ఏవిధంగా తీయాలో అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

–వెంకట్‌రెడ్డి రైతు మేడిపూర్

సాగుకు అనువైన నేలలు..



మండలంలో సాగుకు అనువైన నేలలు ఉన్నాయి. ఆయిల్‌పాం సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చు. మండలంలో 540 ఎకరాలలో ఆయిల్‌పాం సాగు అయ్యింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో మూడు విడతలుగా 3500 ఎకరాలలో రైతులు ఆయిల్‌పాం సాగు చేశారు. మరిన్ని దరఖాస్తులు ఉన్నాయి. ఆయిల్‌పాం సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం మొక్కలు, ఎరువులు, డ్రిప్పు పై సబ్సిడీ అందిస్తుంది.

– శివభార్గవ్, క్లస్టర్ అధికారి

కనిపించని కార్యాలయం బోర్డు



పెద్దకొత్తపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పిచ్చి మొక్కల మధ్య బోర్డు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఉన్న మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన కార్యాలయ బోర్డు పిచ్చిమొక్కల మధ్య దర్శనమిస్తోంది. కార్యాలయానికి వచ్చే ఆయా గ్రామాల ప్రజలకు కార్యాలయం బోర్డు కనిపించకపోవడంతో అయోమయస్థితితో పడుతున్నారు. బోర్డుకు చుట్టు పిచ్చి మొక్కలు ఉండటంతో వెతికివెతికి చూడాల్సిన దుస్థితి నెలకొంది. పాదల్లో బోర్డు ఉన్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రతినిత్యం సంబంధిత కార్యాలయం అధికారులు ఆ బోర్డును చూసుకుంటూ వెళ్తున్నారే తప్పా బోర్డు చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు ఆరోపించారు.

పిచ్చిమొక్కలు తొలగించండి



పెద్దకొత్తపల్లి నుంచి నక్కలపల్లికి వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రం నుంచి నక్కలపల్లి గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపులా కంపచెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో గ్రామస్తుల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనం కనిపించకపోవడంతో వాహనదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. రోడ్డు కుంచించికుపోవడంతో ఎదురుగా వాహనానికి దారి ఇచ్చేందుకు స్థలం లేక కంపచెట్ల పొదల్లోకి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని వాహనదారులు వాపోతున్నారు. ప్రతినిత్యం ఈ రోడ్డు వెంట వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కంపచెట్లను, పిచ్చి మొక్కలను తొలగించాలని కోరారు.